# పాలపిట్ట గూడు పెట్టింది

'అప్పా అప్పా మనికి పాల్పిట్టొచ్చుద్దే-ఫ్ఫ్ అబ్బ ఎంత సల్లగుందయ్యే అప్పా!"

అంటా బల్ వుసారుమీన సందేల యింటికి లగెత్తుకొచ్చి, మంచమ్మీన అప్ప సెంద్రమ్మకాడ ఎగ్గిరి కూకుండాడు కిట్టాయి.

'అబ్బ నీ పిల్లోడు సల్లగుండ! అట్టెగిరి పడ్తాడేం-ఏందిరా సప్పరిత్తం డావు కిట్టా? నాకు పెట్ట వంట్రా?' అంది వయసొచ్చిన సెంద్రమ్మ, కొప్పులో బంతిపూలు దోపుకుంటా.

'అబ్బ యిప్పటికీ ఎంత సల్లగుందే నోరూ! చుందరయ్య మంచోడు గదంటే అప్పా?'

'ఆఁ — ఎవురూ?'

'మన గుడికాడ యిసికి దిబ్బమీన దినాం కూకోడంటే చుందరయ్యా, ఆయినే!'

ఒక్కపాలి సెంద్రమ్మ పయిటెనక గబిక్కిన కదల బార్నాయి-గుండె జల్మ నంటే.

'ఏం దప్పా అట్ట జూత్తావు? ఆ యిన్నేరగవంటే-ఆ దినం సీకట్లో బాయికాడి కెల్లొత్తావుంటే ఎంకీడ్తే ఒచ్చి నిన్ను—'

'తెల్చులే అరవమాకా — సెతురుకి వొట్టుకుంటేనూ—'

'క్లై! నేనే అట్టాటి గిరజాల్దిరిగిన మడ్చనైతేనా! మైసూర్ పోక బొయ్యేవోణ్ణా!'

'అరవమాకరా అయ్యోత్తాడేవోఁ!'

'మనయ్యకు సెవుఁడు గాదంటే—అప్పా అయ్యేడికెల్లాడే?'

'గాదె అల్లికయితే యిచ్చి రాబొయ్యేడుగానీ—యాడుండాడు ఆ యబ్బాయీ?'

'ఎవురు చుందరయ్యా? మరే, నేనే, పిల్లెమ్మల్నెతుక్కుంటా పోతా వుంటేని, వూరకనే జోబిలోంచి బిల్లద్దీసి పెట్టాడే!'

'వూరకనే పెట్టాడంట్రా?'

'ఆఁ కాదే! పాల్పిట్టే ఎగురుకుంటా ఒచ్చి గుడికాడ సింసెట్టుమీన వాల్తేనీ, అబ్బ బ్బబ్బ —'

'ఆఁ?'

"అబ్బబ్బ, బల్ పాల్పిట్ట అంటేనీ, 'అంగకాడికి మనగాడ్దాన్నిప్పిత్తా, యిటొచ్చి కూకోమంటా' బిల్లలు పెట్టాదే !"

'ఆమయిన లగెత్తుకొచ్చా ?'

'ఆఁ. సింసెట్టుకాడ పాల్పిట్ట ఏం తిరుగాడ్తుందదనుకుండా అప్పా ? ఆడో తొఁరుండదే ! అద గూడు పెట్టదంటే పాల్పిట్టా ?'

'ఆమయిన లగెత్తుకొచ్చావంట్రా ?'

'అహాఁ, పాల్పిట్ట యిప్పిత్తాన్లా చుందరయ్యో ?'

'ఆఁ'

'ఆదే కూకున్నా !'

'ఆఁ !'

'అవ్వోప్, నువంటే బల్ గురుండదే మద్బికీ !'

'ఏందీ ?'

'మీ అప్పకు బిల్లలు పెట్టి ఎట్టుండయ్యో అడిగిరా, అన్నాడే !'

'ఓమ్మో !'

'నే అన్ని ఆడే దిన్నాగా !'

'ఆఁ !'

'ఆడకి వూరకుండాడంటాం 'మీ అప్పకి పాల్పిట్ట కావాలా' అంటేనీ ఆప్ అన్నా !'

'సీ యెడవసచ్చినోడా !'

'ఏమ్మా, ఎత్తుకొచ్చి నాకీ రాదంటమ్మా ?'

'నాకిత్తాన్నాడా ?'

'సీకటయినాక గుడికాడికొత్తే యిత్తాన్నాడే. ఎల్లవంటే అప్పా ?'

'ఓమ్మో !'

'ఏవిఁటికమ్మా బయిం ? నేనే సెంద్రమ్మప్ప నయితేనా !–'

"ఆఁ ఏండిరా ?'

'చుందరయ్యా ఆడే వుంటాన్నాడుగామ్మా–?'

'అయ్యోత్తే ?'

'ఏమ్మా ఒత్తే ?'

'నాకు ఒనుకు పుత్తుండది నే ఎల్లనయ్యో !'

'అప్పేదంటే బాయికాడి కెల్లిందంటాగా !'

'నిజంగానంట్రా-వుప్పుడే ఒత్తాగాని సెప్పమాకా-ఏ మయిద్దో—'

* * *

"అప్పప్పా ?"

'అయ్యొచ్చాడా ?'

'రాలేదుగాని-ఏదమ్మా పాల్పిట్టా ?'

'తాలుండు-అబ్బ కల్లు తిరుగుతుండై —'

'తేలేదంటే—?'

'గూడు పెడ్తున్నదంట! రేపు రేత్తిరికొత్తే యిత్తాన్రా-అయ్యొత్తాడు. కూసేపు పొండుకుందాం-అరవమాక—'

★